పొంటి తిరుగుతాండు. ఈ రోజులల్ల పిల్లగాండ్లను ఏమనేటట్టు లేదు!''.

''మరి వాని ఖర్సులు ఎక్కడినుంచి వస్తున్న యక్కా!?''.

''ఏమున్నది తమ్మీ! వాళ్ల నాయిన శెట్టుమీది నుంచి పడ్డంక.. గవర్నమెంటు ఇచ్చిన ఐదు లక్షలు బ్యాంకుల ఉన్నయి గదా! అదేదో ఏటీఎం కార్డని తీసుకచ్చిండు. నా అవసరం ఉన్నా, వానికి అవసరం ఉన్నా.. గా కార్డు తీసుకపోయి పైసలు తీత్తాండు. ఉట్టుట్టి ఖర్సులైతే పెడుతలేడనుకో..!''.

''గట్లయితే మంచిదేగనీ.. గవర్నమెంటు నౌకరీ ఇప్పట్లో రాదు. పట్నంపోయి ఏదో కంపెనీల ప్రయత్నం చేసుకోవచ్చు గదా అక్కా!.. అక్కడ బొచ్చెడు కంపెనీలు ఉన్నయి. దేంట్లనో వోదాంట్ల జేరితే.. కనీసం పదివేలన్నా జీతం ఇత్తరు గదా!''.

''అప్పుడప్పుడు నేనూ, మీ బావ గదే మొత్తుకుంటున్నం. 'సూద్దం తియ్యి!' అంటడుగనీ.. పోతనేలేడు. నువ్వన్నా ఒక్కసారి శెప్పి సూడరాదు తమ్మీ!''.

''అబ్బో! మీరు జెప్తనే ఇననోడు. నేను జెప్తె ఇంటడా!? అయినా.. ఒక పనిజేత్త అక్కా!''.

''ఏం పని తమ్మీ!?''.

''రెండ్రోజుల తర్వాత తాళ్లల్ల నుంచి వచ్చినంక సాయిని మా ఇంటికి తోలుకపోత. అమాటా ఈమాటా మాట్లాడి.. 'తాళ్లెక్కి కష్టపడే మీ నాయిన మంచంల వడె. ఏదో నాకింత తిప్పలైనా.. మీ నాయిన శెట్లుగూడ నేనే గీశి, కల్లుదీశి మీ అమ్మకిత్తె వనంల అమ్ముకోవట్టె. పాపం ఆడమనిషి. ఇంట్ల పని, బయటి పని జేసుకోలేక సత మతం గావట్టె. మన కులవృత్తి గీతపని నేర్సుకో!' అని జెప్త. ఇటు మన పని జేసుకుంట, అటు ఉద్యోగ ప్రయత్నం గూడ చేసుకోమ్మని సంజాయిస్త. సమ్మతమ నిపించి సరేనంటే.. నా ఎంబడి తీస్కపోయి, మోకు పట్టించి.. గీతపని నేర్పిస్త. ఏమంటవక్కా!?''.

''నేనేమంట.. గట్ల మంచిపని చేత్తనంటే.. నేను కాదంటనా!? గట్లనే కానీయ్ తమ్మీ!''.

''సరేగనీ.. తాళ్లకు టైమయితాంది. రొండు కొత్త కుండలు బండిమీద తీసుకపోత. నువ్వు తీరిగ్గా మిగిలిన రొండు కుండలు తీసుకొని రా. అన్నట్టు.. మాటల్ల మర్శి పోయిన. వీరస్వామి బావను పలుకరించి పోత..'' అంటూ, ఇంట్లోకి పోయిండు పరంధాములు.

* * *

పొద్దాళ్లు బాగా ముదిరి కల్లు పుష్కలంగా పారుతున్నది. రోజురోజుకూ వనంలో జనం తాకిడి ఎక్కువ అవుతున్నది. కల్లు మండువ చిన్నపాటి జాతరలెక్క ఉన్నది. తన పాలుకు వస్తున్న కల్లు అమ్ముకోవడంతో వరమ్మ



**తాళ్లు, ఈదులు గీసుడు, కల్లు అమ్ముడు నాతో కానిపని అని చెప్పిన. అది రిస్కుతో కూడుకున్న పని. అందుకే, మనూళ్లె చాలామంది గౌండ్లోళ్లు పట్నంబోయి ఏదో ఒకపని చేసుకొని బతుకుతున్నరు. ముఖ్యంగా నాతోటోళ్లు. నేనుగూడ పట్నంబోయి.. ఏదో ఒకపని చూసుకుంట. నన్ను బలవంత పెట్టకు!**

చాలా ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఉండబట్టలేక కొడుకు సాయినాథ్ సాయం అడిగింది. అందుకు వాడు ససేమిరా అని..

''మొన్న పరంధాములు మామ వాళ్ల ఇంటికి పిలిచి.. నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి, నీ కష్టం గురించీ మాట్లాడి మన కులవృత్తి గీతపని నేర్చుకోమని చాలా ఫోర్స్ చేసిండు. తాళ్లు, ఈదులు గీసుడు, కల్లు అమ్ముడు నాతో కానిపని అని చెప్పిన. అది రిస్కుతో కూడుకున్న పని. అందుకే, మనూళ్లె చాలామంది గౌండ్లోళ్లు పట్నంబోయి ఏదో ఒకపని చేసుకొని బతుకుతున్నరు. ముఖ్యంగా నాతోటోళ్లు. నేనుగూడ పట్నంబోయి.. ఏదో ఒకపని చూసుకుంట. నన్ను బలవంత పెట్టకు!'' అంటూ కసురుకున్నాడు.

కొడుకు మాటలకు వరమ్మ మనసు కలత చెందింది. చేసేది లేక బాధను, వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకొని భర్త తిండికి ఏర్పాటుచేసి, సద్ది తీసుకొని మండువకు బయల్దేరింది.

ఒకరి తర్వాత ఒకరు కల్లు ప్రియుల తాకిడికి వరమ్మకు క్షణం తీరిక లేకుండాపోయింది. మధ్యాహ్నం అన్నం తినే సమయం కూడా దొరకలేదు. ఏదో శక్తిని కూడగట్టుకొని సాయంత్రం వరకూ మొత్తం కల్లు అమ్ముకొని.. వచ్చిన డబ్బులు కూడా లెక్కపెట్టుకునే ఓపికలేక సద్ది సంచిలో భద్రంగా దాచుకొని ఇంటికి బయల్దేరింది. సరిగ్గా ఇంటి గడపలోకి అడుగుపెట్టగానే.. నిలువునా నరికిన చెట్టులా కిందపడిపోయింది.

''అయ్యో వరం..'' అంటూ, గట్టిగా మొత్తుకుంటూ మంచంలోంచి లేవబోతూ దిండుపై వాలి.. సెల్లు తీసుకొని కొడుక్కు ఫోన్ చేశాడు వీరస్వామి. పది నిమిషాల్లో సాయినాథ్ వచ్చి, ఆటో మాట్లాడుకొని అమ్మను దగ్గర్లోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లాడు. డ్యూటీ డాక్టర్ పరీక్ష చేసి, నీరసం వల్ల బీపీ బాగా పెరిగిపోయి పడిపోయిందని చెప్పాడు. కొన్ని మందులు ఇచ్చి, రాత్రంతా అక్కడే ఉంచుకొని మర్నాడు డిశ్చార్జ్ చేశాడు. వారం రోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పాడు. సాయినాథ్.. పట్నంలో ఉన్న అక్కకు ఫోన్ చేసి విషయం చెబితే, వెంటనే బయల్దేరి వచ్చింది లక్ష్మి.

* * *

వీరస్వామి ఇంట్లో అంతా నిశ్శబ్దంగా ఉంది.

ఒక దిక్కు వీరస్వామి.. మరో దిక్కు వరమ్మ. మంచంలో కదలకుండా పడుకొని ఉన్నారు. వరమ్మ కూతురు లక్ష్మి వంటగదిలో పనిలో నిమగ్నమై ఉంది. అమ్మ మంచం పక్కన కుర్చీలో కూర్చొని దీర్ఘాలోచనలో పడ్డ సాయినాథ్.. ఏదో నిశ్చయానికొచ్చి కుర్చీలోంచి లేచి సెల్ తీసుకొని బయటికి వచ్చాడు.

''పరంధాములు మామా! నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి. ఒక్కసారి ఇంటికి వచ్చి పోవా!?'' అని చెప్పి, తిరిగి ఇంట్లోకి వచ్చాడు.

వరమ్మ పడిపోయిన సంగతి తెలిసి, అప్పటికే వద్దామనుకున్న పరంధాములు.. సాయినాథ్ ఫోన్‌తో పావు గంటలోనే పరిగెత్తుకొచ్చాడు. వస్తూనే..

''అక్కెట్లున్నది? రాత్రే తెలిసింది వరక్క కండ్లు తిరిగి పడిపోయిందని!'' అంటూ వరమ్మ దగ్గరికి వెళ్లాడు.

మంచం దగ్గర ఉన్న కుర్చీలో కూర్చొని, పలకరించాడు.

''అమ్మకు బాగా నీరసంగా ఉంది మామా! బీపీ బాగా పెరిగి కండ్లు తిరిగి పడిపోయింది. వారం రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోమన్నాడు డాక్టర్!'' అంటూ కంటి తడిని తడుచుకున్నాడు సాయినాథ్.

''అంతా ఖర్మ! నాన్నకు జీవితాంతం మంచమే గతి అయ్యిందనుకుంటే.. ఇప్పుడు అమ్మకేమో ఈ గతి పట్టే! మూలిగే నక్కమీద తాటిపండు వడ్డట్టాయె!'' అంటూ బాధపడ్డాడు పరంధాములు.

''అవును మామా! మా కుటుంబం అనే బండికి రెండు చక్రాలు నాన్న – అమ్మ! ఆ రెండూ ఇప్పుడు చతికిలబడి పోయాయి. అక్క బావతో పట్నంలో సంతోషంగా ఉంది. మిగిలింది నేను. ఇక వీళ్లకు దిక్కెవరు? నేనే కదా మామా! చిన్నదో పెద్దదో పట్నంలో ఏదో ఒక ఉద్యోగం వెతుక్కున్నా.. వీళ్లను ఇక్కడే విడిచి పోవాలి. అప్పుడు వీళ్ల గతి ఏం కావాలి? అందుకే, బాగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చిన.. పరంధాములు మామా!''.

''ఏం నిర్ణయం రా!?''.

''ఆరోజు నువ్వు నన్ను మీ ఇంటికి పిలిచి.. మా నాన్న పరిస్థితి, అమ్మ పడుతున్న కష్టాలు, నా భవిష్యత్తు గురించి మాట్లాడిన మాటలు పెడచెవిన పెట్టాను. ఆ మాటలే ఇప్పుడు నా చెవుల్లో సుద్దులుగా మారుతున్నాయి. నువ్వన్నట్టు.. ఉద్యోగం కులవృత్తికంటే మించింది కాదు. ఆ వృత్తికి సాటి మరేది రాదు''.. అంటూ, పక్క గదిలోకి వెళ్లి, చిలుక్కొయ్యకు తగిలించి ఉన్న మోకును తీసుకొని వచ్చాడు సాయినాథ్.

''ఇదిగో మామా! నాన్న ఎంతో ఇష్టంతో తయారుచేసుకున్న మోకు! ఈ కొత్త మోకుతోనే నేను గీతపని నేర్చుకుంట. ఇక వనంలోకి పోదాం పద మామా!'' అంటూ మోకును భుజానికి తగిలించుకున్నాడు సాయినాథ్ గౌడ్. ■

## కూతురు రాంరెడ్డి



కథకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞ చాటుతున్నారు కూతురు రాంరెడ్డి. ఈయన స్వస్థలం కరీంనగర్ జిల్లా సైదాపూర్. బీకాం చదివారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1970 నుంచి కథలు, కవితలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 150 కథలు, 60 కవితలు రాశారు. కొత్తచివుళ్లు, జారుడు బండలు, కాలుతున్న కట్టెలు, గాలిలో తేలిపోతున్నాం (అమెరికా అనుభవ కథలు), బతుకమ్మ, నీరడిమడి, నేను నా యోగా పుస్తకాలను వెలువరించారు. ఉద్యోగిగా.. ఎక్సైజ్ శాఖలో 3 సార్లు ఉత్తమ సేవా పతకాలు అందుకున్నారు. 1995లో ఎక్సైజ్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటికల పోటీలో 'లవ్ పాఠాలు' నాటకంలో నటించి.. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతులమీదుగా ఉత్తమ నటుడిగా బహుమతిని దక్కించుకున్నారు. 'తుమ్మల' రంగస్థల పురస్కారం, భారత్ కల్చరల్ అకాడమీ– హైదరాబాద్ నుంచి 'విశిష్ట కళారత్న' అవార్డు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 'కీర్తి పురస్కారం' అందుకున్నారు.